క్లుప్తంగా

భగవద్గీత పుస్తకాలు పంపిణీ

చిత్తూరు రూరల్: బీజేపీ సేవా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం బీజేపీ నాయకులు షణ్ముగం ఆధ్యాత్మిక పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట 1000 భగవద్గీత పుస్తకాలు, 250 గీత సారం, 750 హనుమాన్ చాలీసా పుస్తకాలను జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు నాయకులు రవికుమార్, గోకులాయాదవ్, చందు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాల శీతలీకరణ కేంద్రం పరిశీలన



పాల శీతలీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

పూతలపట్టు: మండలంలోని పాల శీతలీకరణ కేంద్రాలను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శనివారం ఆయన మండలంలోని పోలవరం పంచాయతీలో నిర్మిస్తున్న వైఎస్సార్ పాలశీతలీకరణ కేంద్ర భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్ ఏఈ ప్రసాద్, తహసీల్దార్ విజయభాస్కర్, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజర్వేషన్ బిల్లు ఆమోదం హర్షణీయం

చిత్తూరు కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం హర్షణీయమని హ్యూమన్ డొమెస్టిక్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తద్వారా లబ్ధిపొంది ఆయా రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందాలన్నారు. హింస, వేధింపులకు గురవుతున్న మహిళలను కాపాడేందుకు మహిళా రక్షణ ఫోరంను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: సీపీఎస్‌ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ (257) జిల్లా అధ్యక్షులు గోపినాథ్ అన్నారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ జీపీఎస్, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. జీవీ 117ను మరోసారి పునఃపరిశీలన చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి ముక్తార్ మాట్లాడుతూ ఓపీఎస్‌ను అమలు చేస్తే లక్షలాది మంది ఉద్యోగులకు మేలు కలుగుతుందన్నారు. అనంతరం తమ డిమాండ్లను పరిష్కరించాలని డీఆర్‌ఓ రాజశేఖర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో ఆ సంఘం నాయకులు మధు, అఫ్జల్, వాసు, వేణు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధన చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు రూరల్: విద్యార్థులకు మెరుగైన విద్యబోధన చేయాలని ఉపాధ్యాయులకు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. చిత్తూరు మండలం అయ్యప్పగారి పల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పిల్లలకు అర్థమయ్యేరీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు.

పార్టీని మరింత బలోపేతం చేస్తా



సి.పి.హరిరెడ్డి

తవణంపల్లె: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేస్తామని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సి.పి.హరిరెడ్డి తెలిపారు. తవణంపల్లె వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా హరిరెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేయడమే ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. మండలంలోని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, నాయకులను ఏకతాటిపై నడిపించి, పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు.

సురక్ష.. ఆరోగ్యానికి శ్రీరామరక్ష

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- అన్ని మండలాల్లో వైద్య శిబిరాలు
- ప్రత్యేక నిపుణులతో వైద్యసేవలు



గుడిపాల: కంటి అద్దాలను అందజేస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



పూతలపట్టు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

గుడిపాల: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని వసంతాపురం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం స్థానిక సర్పంచ్ రజినీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి నాణ్యమైన వైద్యసేవలు అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యసేవలు దేశంలో ఎక్కడా లేవని, ఈ సేవలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. అనంతరం జిల్లా అంధత్వ సంస్థ ఆధ్వర్యంలో పలువురికి కంటి అద్దాలను ఆయన అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాల గురించి సీడీపీవో ఆయనకు వివరించారు. పౌష్టికాహార స్టాల్స్‌లో ఉన్న వాటిని ఆయన కొన్నింటిని భుజించారు. ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 622 మంది రోగులు హాజరయ్యారు. ఇందులో 15 మందికి శస్త్రచికిత్సల కోసం వివిధ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, డెప్యూటీ తహసీల్దార్ కల్యాణి, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి, స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయాధికారి మాధవి, డాక్టర్లు శేషగిరిరావు, హరి, హరిబాబు, అనూష, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, సాముయేలు, గోపి, మురళితోపాటు వైద్యసిబ్బంది, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం చింతలగుంట డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఎమ్మెల్యే శిబిర నిర్వహణ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఆశయం మేరకు వైద్య బృందం పనిచేసి జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, దిలీప్, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, వైద్యాధికారులు సుదర్శన్, భాస్కర్, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు

పూతలపట్టు: ×జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ ఉచిత వైద్య పరీక్షలు అందుతున్నాయని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని చిటిపిరాళ్ల పంచాయతీ పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్యాధికారులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్య సురక్ష ద్వారా 7 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. క్యాంపు నిర్వహించడం ద్వారా చిటిపిరాళ్ల పంచాయతీలోని 369 మంది ప్రజలు ఉచిత నాణ్యమైన వైద్యాన్ని అందుకున్నట్లు తెలిపారు. అనంతరం వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా కంటి పరీక్షలు చేయించుకున్నవారికి కంటి అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తలపులపల్లి బాబురెడ్డి, మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, వైద్యాధికారులు, మండలాధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి నాంది

ఐరాల: గ్రామీణ ప్రాంత ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని స్టేట్ జాయింట్ డైరెక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జనార్దన్ అన్నారు. కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని పుత్రమద్ది సచివాలయం ఆవరణలో శనివారం స్థానిక సర్పంచ్ సుశీల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 379 మందికి స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బుజ్జిరెడ్డి, తహసీల్దార్ సుశీలమ్మ, ఎంపీడీఓ నాగరాజు, డాక్టర్లు చందన, పూర్ణలత, స్పెషలిస్ట్ డాక్టర్లు, ఎంపీహెచ్ఈఓ శివయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం

యాదమరి: మండలంలోని జంగాపల్లెలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జనార్దన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రోగులకు చికిత్సలు అందించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్, వైద్యులు అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సురక్ష ప్రజలకు వరం

తవణంపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని సరకల్లులో శనివారం స్థానిక సర్పంచ్ సతీష్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. సరకల్లు ప్రాథమికోన్నత పాఠశాలలో వైద్యాధికారులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మోకాలు కీళ్ల శస్త్ర చికిత్సకోసం ముగ్గురిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫరల్ చేయించారు. ఐసీడీఎస్ అధికారులు తయారు చేసిన వివిధ రకాల వంటలు, తాజా కూరగాయలను ప్రదర్శించగా అధికారులు పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.






ఐరాల: వైద్య శిబిరంలో కళ్ల జోడు అందిస్తున్న స్టేట్ జాయింట్ డైరెక్టర్ జనార్దన్, యాదమరి: వైద్యులతో మాట్లాడుతున్న జనార్దన్, తవణంపల్లె: క్యాంపును ప్రారంభిస్తున్న సర్పంచ్ సతీష్ రెడ్డి, అధికారులు, చిత్తూరు: వైద్యశిబిరంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

3 నుంచి సురక్ష వైద్య శిబిరాలు

బంగారుపాళెం: మండలంలో అక్టోబరు 3వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 3వ తేదీ తంబుగానిపల్లె జెడ్పీ హైస్కూల్, 4న బొడబండ్ల జెడ్పీహైస్కూల్, 5న సంక్రాంతిపల్లె ఎంపీపీ స్కూల్, 6న కాటప్పగారిపల్లె, 7న కూర్మాయిపల్లె, 9న కీరమంద, 10న చీకూరుపల్లె, 11న టేకుమంద, 12న మహాసముద్రం, 13న మొగిలిమిట్టూరు, 16న వెలుతురుచేను, 17న మొగిలివారిపల్లె, 18న కొదలమడుగు, 19న పాలేరు, 20న కేఎం కండ్రిగ, 21న ఈచనేరివారిపల్లె, 24న పీడీవీ కండ్రిగ, 25న శెట్టేరి, 26న రాగిమానుపెంట, 27న నల్లంగాడు, 28న జంబువారిపల్లె, 30న తగ్గువారిపల్లె, 31న బంగారుపాళెం. నవంబరు 1న గుంతూరు, 2న బంగారుపాళెం-2 గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తికి ఉద్యోగుల సత్కారం



హైకోర్టు జడ్జిని సన్మానిస్తున్న ఉద్యోగులు

చిత్తూరు అర్బన్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారిని జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. చిత్తూరులోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో శనివారం రాష్ట్ర న్యాయశాఖ ఉద్యోగ సంఘం నాయకులు గోపినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు కలిశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు రవీంద్రారెడ్డి, లక్ష్మీపతి, సుందర్, రాజేష్, గిరిధర్ రెడ్డి, దాము, పవన్‌కుమారి, హరికృష్ణ తదితరులు ఉన్నారు. మరోవైపు చిత్తూరు న్యాయవాదుల సంఘం (బార్) ఆధ్వర్యంలో సైతం హైకోర్టు న్యాయమూర్తిని కలిసి వినతిపత్రం అందచేశారు. బార్ అధ్యక్ష, కార్యదర్శి రాజేంద్రరెడ్డి, అశోక్ ఆనంద్ యాదవ్ మాట్లాడుతూ చిత్తూరులో జరుగుతున్న నూతన న్యాయస్థానాల భవనం నిర్మాణం, నిధులు, న్యాయస్థానాల్లో ఖాళీల భర్తీపై చొరవ చూడాలని కోరారు. బార్ అసోసియేషన్ నాయకులు విశ్వనాథ్, వెంకటపతినాయుడు తదితరులు హైకోర్టు జడ్జిని సన్మానించారు.

పెనుమూరు ఘటనపై లోతైన దర్యాప్తు చేయాలి



డీఆర్‌ఓతో మాట్లాడుతున్న రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ రేవతి

చిత్తూరు కలెక్టరేట్: ఇటీవల పెనుమూరు ఘటనపై లోతైన దర్యాప్తు చేయాలని పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట బీసీవై, సీపీఎం పార్టీలు, వడ్డెర సంఘం నాయకులు శనివారం ధర్నా చేశారు. కలెక్టరేట్‌లోనికి వెళ్లేందుకు ప్రయత్నించిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రేవతి డీఆర్‌వో రాజశేఖర్‌తో చర్చించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పెనుమూరు మండలానికి చెందిన బాలిక అదృశ్యంపై తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారన్నారు. బాలిక ఘటనను ముమ్మరంగా దర్యాప్తు చేసి బాలిక కుటుంబీకులకు న్యాయం చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

కేసు సీబీఐకి అప్పగించాలి

చిత్తూరు అర్బన్: పెనుమూరులో బాలిక మృతి చెందిన ఘటనను సీబీఐకు అప్పగించాలని టీడీపీ మహిళా విభాగం నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆ పార్టీ మహిళా నేతలు కఠారి హేమలత, యాళ్ల లక్ష్మీప్రసన్న, నాగలక్ష్మి, వరలక్ష్మి మాట్లాడారు.

బైక్-ఆటో ఢీ: వ్యక్తికి గాయాలు



సంఘటన స్థలంలో గాయపడిన చంద్రయ్య

బంగారుపాళెం: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై శనివారం ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీ కొన్న సంఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. తగ్గువారిపల్లెకు చెందిన చంద్రయ్య ద్విచక్ర వాహనంపై గోవర్ధనగిరి గ్రామంలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా బంగారుపాళెం వద్ద వెనుక నుంచి ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రయ్య తలకు బలమైన గాయం తగిలింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గోవిందరాజుల గుట్టలో భక్తజనం



గోవిందరాజుల గుట్ట శ్రీవారి పాదాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం టి.వేపనపల్లి సమీపంలోని గోవిందరాజుల గుట్ట శనివారం భక్తజనంతో నిండిపోయింది. శ్రీవారి భజనలతో భక్తులు ఊరేగింపుగా కొండెక్కారు. శ్రీవారి పాదాలకు పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో ఆదివారం నుంచి సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తారన్నారు. లబ్ధిదారులు వలంటీర్లకు అందుబాటులో ఉండి పింఛన్ నగదును 5 రోజుల్లోపు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ హక్కులను తెలుసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ హనుమంతు

యాదమరి: గ్రామీణ ప్రజలందరూ తమ హక్కులను తెలుసుకోవాలని తహసీల్దార్ హనుమంతు చెప్పారు. మండలంలోని పేరకూరు దళితవాడలో పౌర హక్కులపై గ్రామీణ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామీణులు ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా అధికారులకు విన్నవించాలని చెప్పారు. అగ్రకులాల వారు ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినా భయపడకుండా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివరాజ్, ఎస్ఐ సుమన్, సర్పంచ్ పరంధామ గౌడ్, ఎస్సీ, ఎస్టీ నాయకులు మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో స్వచ్ఛతా హి సేవ



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: గాంధీ జయంతిని పురస్కరించుకుని చిత్తూరు నగరంలో ఆదివారం నిర్వహించనున్న స్వచ్ఛతా హి సేవ పనులను ద్విగిజయం చేయాలని మునిసిపల్ కమిషనర్ డా.అరుణ ఆదేశించారు. కార్పొరేషన్‌లోని ప్రజారోగ్యం విభాగం, సచివాలయ పర్యావరణ పారిశుద్ధ్య కార్యదర్శులతో శనివారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా నగరంలో పరిశుభ్రత కోసం శ్రమదానం చేపట్టాలన్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి జరగనున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, యువత, ప్రజల్ని భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి చర్యలు చేపట్టండి



అవగాహన సదస్సులో పాల్గొన్న జేఏసీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు నగరం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని చిత్తూరు స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు తాండవమూర్తి కోరారు. కలెక్టరేట్ ఎదుట శనివారం ఆ సొసైటీ సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగర ప్రధాన సమస్యల పరిష్కారం కోసం అనేక సంఘాలు కలిసి జేఏసీగా ఏర్పాటైనట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా కేంద్రానికి నూరేళ్ల చరిత్ర ఉందన్నారు. తమిళం, తెలుగుకు సంబంధించిన ప్రజలు చిత్తూరు నగరంలో జీవిస్తున్నారన్నారు. గత పాలకులు చిత్తూరు నగరం అభివృద్ధికి ఏ మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. చిత్తూరు నగరంలోని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లేలా జేఏసీలో నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శివకుమార్, సత్య, శోభారాణి, మురళి పాల్గొన్నారు.

కాణిపాకంలో సాంస్కృతిక శోభ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారి ఆస్థాన మండపంలో కళాకారులు, గాయకులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు కళాకారులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గణేష దీక్ష ఇరుముడులు చెల్లించిన భక్తులు

వరసిద్ధి వినాయక స్వామికి శ్రీకాకుళం జిల్లా, ఖమ్మం జిల్లాకు చెందిన భక్తులు శనివారం ఇరుముడులు చెల్లించారు. శ్రీకాకుళం జిల్లా కొత్తపేటకు చెందిన 25 మంది భక్తులు, ఖమ్మం జిల్లా సత్తుపల్లెకు చెందిన 40 మంది భక్తులు గణేష ఇరుముడులు ధరించి స్వామివారి దర్శనం విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ సమీపంలో వారు ఇరుముడులు చెల్లించిన, దీక్షకు ముగింపు పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బిందెలపై నాట్యం చేస్తున్న కళాకారులు



భరతనాట్య ప్రదర్శన




కాణిపాకంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లెకు చెందిన భక్తులు, శ్రీ కృష్ణుని రాయబారం నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు